క్లుప్తంగా

మద్యం సీసాలు స్వాధీనం

పొన్నలూరు: మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన పాటకరి వెంకటేశ్వర్లు అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తుండగా ముత్తరాసుపాలెం అడ్డ రోడ్డు వద్ద పొన్నలూరు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. అక్రమంగా మద్యం తీసుకెళ్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వ్యక్తిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై కె. అనుక్ తెలిపారు.

కొండపి (సింగరాయకొండ): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు. కొండపి గ్రామానికి చెందిన కె. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం అందడంతో వెంటనే తన సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 10 క్వార్టర్ సీసాలను స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

కనిగిరి రూరల్: మొబైల్ బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. స్థానిక డీపో సమీపంలో బైక్ పై మద్యం బాటిళ్లను పెట్టుకుని విక్రయిస్తున్న చింతపాలెంకు చెందిన బెల్టుషాపు నిర్వాహకుడిని పోలీసులు పట్టుకుని అతని వద్ద నుంచి 24 క్వార్టర్ బాటిళ్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

మద్దిపూడి: మండలంలోని రావెళ్లవారిపాలెం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎంఈఓ ఈవీ రంగయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సహాయ వంటమాస్టర్ 1, డే వాచ్‌ఉమెన్‌కు 1, స్వీపర్ 1 పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 15వ తేదీలోపు మద్దిపూడి మండల విద్యాశాఖ కార్యాలయంలోదరఖాస్తుఅందజేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయలైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. మండలంలోని సుల్తాన్ పురం మలుపు సమీపంలో ద్విచక్ర వాహనం వెనుక నుంచి వస్తున్న నిమ్మకాల లోడు బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ పై ఉన్న వలి, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఎస్సై టి. శ్రీరాం దర్యాప్తు జరుపుతున్నారు.

25వ సారి రక్తదానం

కనిగిరి రూరల్: పట్టణానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు శ్రీరాం మురళీ 25వ సారి రక్తదానం చేశాడు. పీసీపల్లి మండలం రామాపురానికి చెందిన ఊకట్ల ప్రణయ్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో స్థానిక హర్షిత ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో ఉపాధ్యాయుడు మురళి ఓ పాజిట్ రక్తాన్ని అందజేసి ఆదుకున్నాడు.

సెల్ టవర్ నిర్మాణం అడ్డగింత

కనిగిరి రూరల్: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణం వద్దంటూ శివనగర్ కాలనీవాసులు మంగళవారం ఆందోళన చేశారు. కాలనీలోని వెంకటేశ్వర థియేటర్ వెనుక వైపు టవర్ నిర్మించేందుకు యంత్రాలతో పనులు ప్రారంభించగా స్థానికులు అడ్డుకున్నారు. పేదలు నివసించే ప్రాంతంలో ఇళ్ల మధ్య టవర్‌లు నిర్మించడం వల్ల అనేక ఆరోగ్య నష్టాలు, సమస్యలు ఏర్పాడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నా.. మరలా రావడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోక పోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మహిళపై కేసు నమోదు

పామూరు: అక్రమంగా మద్యం 45 క్వార్టర్ బాటిళ్లు నిల్వ ఉంచిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. బొట్ల గూడూరులో మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మంగళవారం తనిఖీలు నిర్వహించగా సుశీలమ్మ అనే మహిళ చెట్లలో ఉంచిన 45 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అధ్వానంగా కొచ్చెర్లకోట-మార్కాపురం రోడ్డు



దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట నుంచి మార్కాపురం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లతో మూసుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. పాదాచారులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్‌లు ఈ రహదారి నుంచి వెళ్లాలంటే చిల్ల చెట్లు మూసుకుపోయి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. రాత్రి వేళల్లో ఎదురు ఎదురుగా వాహనాలు ఢీకొన్న సంఘటనలు జరిగాయి. ప్రమాదాలు జరిగాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొచ్చెర్లకోట నుంచి నిత్యం ఆ రోడ్డు రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా రైతులు ఎక్కువ భాగం పొలాలకు వెళ్తుంటారు. ఎన్నోసార్లు చిల్లచెట్లు తొలగించాలని అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని కొచ్చెర్లకోట, సిద్దాయపాలెం గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హీటు పుట్టిస్తున్న రేటు

- పెరిగిన నిత్యావసరాల ధరలు
- ఆందోళనలో నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు
- పండగ పూట కూడా పస్తులేనంటూ ఆవేదన
- ధరల నియంత్రణపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం



ఒంగోలు సిటీ: రోజురోజుకూ పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలతో నిరుపేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారుతోంది. సరుకుల ధరలతో పాటు కూరగాయల ధరలు సైతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం దసరా పండుగ నేపథ్యంలో.. పెరిగిన నిత్యావసర ధరలు, కూరగాయల ధరలు చూసి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత రెండు నెలల నుండి మార్కెట్లో సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రస్తుతం పండుగకు సరుకులు కొందామని సామాన్య, మధ్య తరగతి ప్రజలు మార్కెట్‌కు వెళ్లి పెరిగిన ధరలు చూసి గుండెలు బాదుకుంటున్నారు. ఒకవైపు నిత్యావసర సరుకులు, మరోవైపు కూరగాయల ధరలు పెరిగిపోవడంతో ఏం కొనలేని, తినలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. సన్‌ఫ్లవర్, పామాయిల్ నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. కొబ్బరి, వెల్లుల్లి ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ 15 లీటర్ల డబ్బా రెండు నెలల క్రితం రూ.1,600 ఉండగా, ప్రస్తుతం రూ.1,950కిపైగానే పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజానీకం ఏం కొనలేం.. ఏం తినలేం అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అరకొరగా కొనుగోళ్లు...

ధరలు పెరిగిపోవడంతో పండుగ పూట కూడా అర్థాకలేనా అంటూ ప్రజలు నిట్టూరుస్తున్నారు. అరకొర కొనుగోళ్లతో సర్దుకుపోతున్నారు. సాధారణంగా దసరా పండుగకి ముందు కిటకిటలాడాల్సిన మార్కెట్లు, కిరాణా షాపులు వెలవెలబోతున్నాయి. హోల్‌సేల్‌తో పాటు రిటైల్ షాపుల నిర్వాహకులు సైతం వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా వచ్చినా అరకొరగా సరుకులు తీసుకెళ్తున్నారని చెబుతున్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో ఉన్నంతలో అరకొర కొనుగోళ్లతో సామాన్య ప్రజలు సర్దుకుపోతున్నారు. పండగ పూట కూడా పస్తులు తప్పేట్టు లేవంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాటలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు పంపిణీ చేసింది. నిత్యావసర సరుకులు ఇంటింటికీ సరఫరా అయ్యేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్డుదారులకు కందిపప్పు, చక్కెర ఇవ్వకుండా బియ్యంతో సరిపెడుతోంది. కందిపప్పు పంపిణీ చేస్తామన్న ప్రభుత్వం మాటలకే పరిమితమైందంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ధరలు అధికంగా పెరిగిన నిత్యావసరాలు

పామాయిల్ లీటరు	రూ.125
సన్‌ఫ్లవర్ ఆయిల్	రూ.135
చింతపండు (కేజీ)	రూ.250
గోధుమపిండి (కేజీ)	రూ.65
కందిపప్పు (కేజీ)	రూ.170
టమోట (కేజీ)	రూ.90
చిక్కుడు (కేజీ)	రూ.60
ఉల్లిపాయలు (కేజీ)	రూ.70
బంగాళదుంప (కేజీ)	రూ.60
వంకాయ (కేజీ)	రూ.60

అదేవిధంగా ధరల నియంత్రణకు చర్యలు చేపట్టకుండా పేదల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శిస్తున్నారు.

ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో ఘోరంగా విఫలమయ్యాయి. మార్కెట్లో నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు ఏం కొనలేని, ఏం తినలేని పరిస్థితి. ప్రజలు పండుగ పూట పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి విపరీతంగా పెరిగిపోతున్న నిత్యావసర, కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– దామరాజు క్రాంతికుమార్, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

గళం విప్పడమే బాలగోపాల్‌కు నివాళి



బాలగోపాల్‌కు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: దేశ ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీస్తూ చిచ్చు రాజేస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా గళం విప్పి మాట్లాడటమే హక్కుల ఉద్యమ నేత బాలగోపాల్‌కు నిజమైన నివాళి అవుతుందని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అన్నారు. మానవ హక్కుల ఉద్యమ నాయకుడు బాలగోపాల్ 15వ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న మంచి పుస్తకం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా, రాజ్యహింసకు వ్యతిరేకంగా బాలగోపాల్ అలుపెరుగని పోరాటాలు చేశారని తెలిపారు. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఎన్నో పుస్తకాలు రచించారని గుర్తు చేశారు. జీవితంలో ఎన్నో నిర్బంధాలను ఎదుర్కోవడం ద్వారా ఏపీసీఎల్‌సీ బాలగోపాల్‌గా గుర్తింపు పొందిన బాలగోపాల్ నేటికీ స్ఫూర్తిపతాకగా నిలుస్తున్నారని సోషల్ డెమొక్రటిక్ ఫోరం కన్వీనర్ కత్తి కళ్యాణ్ చెప్పారు. బాలగోపాల్ ఆలోచనలను ప్రచారం చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరమన్నారు. సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ నాయకులు భీమవరపు సుబ్బారావు, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి జార్జి, ఐఎల్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుందరం, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, జీజీహెచ్ హెచ్‌ఓడీ డాక్టర్ సుధాకర్‌రావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ధరణికోట లక్ష్మీనారాయణ, వేజండ్ల శివరావు, పిన్నిక సుబ్రహ్మణ్యం, ఆవుల సుబ్రహ్మణ్యం, తోరటి ఆనంద్ పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిపై శ్రద్ధ వహించాలి

ముండ్లమూరు (దర్శి): గ్రామాల అభివృద్ధిపై అధికారులు శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ సూచించారు. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లతో రీప్లేస్‌మెంట్ శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ జనార్దన్ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయడంలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ముందుండాలన్నారు. మౌలిక వసతులు ప్రజలకు అందుబాటులోకి తేచ్చే విధంగా కృషి చేయాలన్నారు. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఈఓపీఆర్డీ

కొనకనమిట్ల: మండల పరిషత్ విస్తరణాధికారిగా జి.శ్రీదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ముండ్లమూరు మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా కొనకనమిట్లలో నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఓపీఆర్డీగా, ఇన్‌చార్జి ఎంపీడీఓగా పని చేసిన రావూరి జనార్దన్ ముండ్లమూరు మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఈఓపీఆర్డీకి కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

● ఏఓ రమేష్



రైతులకు పొద్దు తిరుగుడు పంట విత్తనాలను అందిస్తున్న ఏఓ రమేష్

మద్దిపాడు: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఏఓ కే రమేష్ అన్నారు. మండలంలోని మల్లవరం కొలచనకోట గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. అనేక సంవత్సరాల నుంచి భూమిలో ఎరువులు, పురుగుమందులు వాడడం వలన భూమి నిస్సారమై చౌడుగా మారిందని, దీన్ని నివారించడానికి రెండు టన్నులు ఎకరాకు పశువుల ఎరువులు వాడాలని సూచించారు. వరిపంటలో కాండం తొలచు పురుగును నివారించడానికి వేపగింజల కషాయం పిచికారి చేయాలన్నారు. వరిలో వచ్చే ఆకుముడత పురుగు నివారణకు కషాయం బాగా పని చేస్తుందని తెలిపారు. రైతులు పంట వేసిన 15 నుంచి 30 రోజుల్లోపు ఒకసారి పిచికారి చేసుకోవాలన్నారు. జెడ్‌బీఎన్‌ఎఫ్ పథకం కింద గ్రామ రైతులకు కూరగాయల విత్తనాలు, పొద్దు తిరుగుడు పంట విత్తనాలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్‌లు నారా సుబ్బారెడ్డి, డొక్కా మరియమ్మ, ఏఈఓ శేషయ్య, వీఏఏలు దామోదర్, హరితేజ, మల్లవరం, కొలచనకోట గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: మండలంలోని అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేసుకోవాలని ఎంపీపీ వాకా అరుణా కోటిరెడ్డి అన్నారు. వార్డు మెంబర్లకు, ఉప సర్పంచ్‌లకు మంగళవారం ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో వచ్చే ఆదాయం ఏవిధంగా ఖర్చు చేయాలో శిక్షణలో అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించడంపై ఆమె అభినందించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఏవిధంగా నిర్వహించాలన్న విషయాలు వార్డు మెంబర్లు అభివృద్ధిలో ఏవిధంగా పాలు పంచుకోవాలన్న అంశాలను వివరించారు. టీఓటీలు శ్రీకాంత్ ఆశాలక్ష్మి, కార్యాలయ ఏఓ శ్రీనివాస వరప్రసాద్, గ్రామ కార్యదర్శులు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

డెంగీపై వైద్య సిబ్బంది అప్రమత్తం



నీటిలో లార్వాను గుర్తించి తొలగిస్తున్న అధికారులు

అల్లూరు (కొత్తపట్నం): ఓ వ్యక్తికి డెంగీ రావడంతో మెడికల్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. అల్లూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి డెంగీ రావడంతో రిమ్స్‌కు తరలించారు. మూడు రోజుల పాటు చికిత్స పొంది పూర్తిగా తగ్గి ఇంటికి తీసుకొచ్చారు. మెడికల్ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి జ్వరం, బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేశారు. పంచాయతీ సిబ్బంది ఈ నెల 3, 4 తేదీల్లో అల్లూరు గ్రామ పంచాయతీ అంతా ఫాగింగ్, బ్లీచింగ్ చేయించారు. పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది ఇళ్ల వద్ద నిల్వ ఉన్న తొట్టిలో ఉన్న నీరు, టెంకాయ బోండాల్లో ఉన్న లార్వాను నిర్మూలించారు. మంగళవారం గుంటూరు జిల్లా నుంచి జెడ్‌ఎంఓ ఆఫీస్ నుంచి జి.వీరరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, కోడేల శ్రీనివాసరావు అల్లూరును సందర్శించారు. డెంగీ దోమలను, లార్వాను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణం మారుతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని, అంతా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఒంగోలు జిల్లా మలేరియా ఆఫీసు సబ్ యూనిట్ ఆఫీసర్ సాగర్, పి.శ్రీనివాసరావు, గుంటూరు టీమ్ కలిసి గ్రామంలో పర్యటించింది. కొత్తపట్నం పీహెచ్‌సీ సీహెచ్‌వో ఓంకార్, ఏఎన్‌ఎం ప్రియాంక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంజమ్మకు సూర్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో ఉపాధి



తోపుడుబండి వద్ద అంజమ్మ, దాతలు

ఒంగోలు సిటీ: ఒంగోలులోని పేర్నమిట్టలో నివసిస్తున్న అంజమ్మకు సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సుబ్బు ఎంఎస్‌డీ సహకారంతో తోపుడు బండిని ఏర్పాటు చేసి కూరగాయలు ఇప్పించి జీవించేందుకు ఉపాధి కల్పించారు. ఈ సందర్భంగా సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి సర్దార్ మాట్లాడుతూ అంజమ్మకు ముగ్గురు పిల్లలు. ఆమె భర్త ఇల్లు వదిలి వెళ్లిపోవడంతో కుటుంబం కూడా జరగడం చాలా కష్టంగా ఉంది. ఆమె ముగ్గురు పిల్లల పోషణకు, చదువుకునేందుకు ఇబ్బంది కలగకుండా బేల్దారి పనికి వెళ్తుంది. బేల్దారి పని చేస్తున్న సందర్భంలో సిమెంట్ బస్తా నడుంపై పడటంతో బరువులు ఎత్తలేక, ఇక ఎటువంటి పని చేయలేక కుటుంబం జరగడానికి కూడా ఇబ్బందిగా ఉందని బాధితురాలు ట్రస్టును ఆశ్రయించింది. దాతల సాయంతో కూరగాయల వ్యాపారం పెట్టించి ఆమెకు ఉపాధి కల్పించినట్లు సర్దార్ తెలిపారు. జనసేవ శ్రీనివాసరావు, సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



కేశవస్వామిపేట ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో విజయలక్ష్మీదేవిగా రాజ్యలక్ష్మి



మిలటరీ కాలనీ కనకదుర్గ దేవాలయంలో మంగళహారతుల దర్శనంలో మహిళలు

● మహాలక్ష్మీ..నమోస్తుతే!

ఒంగోలు మెట్రో: శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నగరంలోని అమ్మవారి ఆలయాల్లో జగన్మాత మహాలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మంగళప్రదమైన దేవత శ్రీ మహాలక్ష్మీదేవిని దర్శిస్తే ఐశ్వర్య ప్రాప్తి, విజయం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఒంగోలు గాంధీ రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవీ మాత మహాలక్ష్మీదేవిగా భక్తులను అనుగ్రహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి తదియారాధన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీసూక్త సహితంగా అభిషేకించారు. సాయంత్రం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారి మూలవిరాట్‌కు తొమ్మిది లక్షల తొంభై తొమ్మిది వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయలతో అలంకరణతో మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శర్మ, సాయి ఉభయ దాతలచే ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించారు. రాత్రి జరిగిన ఉత్సవంలో శ్రీ వాసవీ కోలాట భజన మండలి వారిచే కోలాటం భక్తియుతంగా సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



లలితాదేవి అలంకరణలో అచలానందాశ్రమంలోని గోవిందమాంబ అమ్మవారు



కేశవస్వామిపేట విజయదుర్గాదేవి అమ్మవారుని దర్శించుకుంటున్న భక్తులు



ధనలక్ష్మి అలంకారంలో కనకదుర్గమ్మ అమ్మవారు



కొప్పోలులోని చెన్నకేశవస్వామి ఆలయంలో ధనలక్ష్మిగా రాజ్యలక్ష్మీ అమ్మవారు



గాజులతో అలంకరణలో కేశవస్వామిపేట కనకదుర్గాదేవి అమ్మవారు



వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మహాలక్ష్మి పూజలో మహిళలు

న్యాయ వ్యవస్థలోనూ మహిళలకు సమాన అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ

కొత్తపట్నం: న్యాయ వ్యవస్థలో కూడా మహిళలకు సమాన అవకాశాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది కాట్రగడ్డ అరుణ అన్నారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్ నిర్వహించిన విధాన సేవాధికార సంస్థ, జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విధాన్ సే సమాధాన్ అనే కార్యక్రమంలో భాగంగా మహిళలకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు న్యాయ సంస్థలో అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరో సీనియర్ న్యాయవాది ఎస్.ధనలక్ష్మి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళల పట్ల జరుగుతున్న లైంగిక దోపిడీ గురించి, వాటి నివారణ కోసం యాజమాన్యాల ఏర్పాటు చేయాల్సిన సంఘాల గురించి బాల్య వివాహాలతో చ్చే అనర్థాల గురించి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మహిళలకు అందించే ఉచిత న్యాయ సాయం గురించి వివరించారు. సీడీపీవో కె.ఫణిరాజకుమారి, డీఆర్‌డీఏ ఏపీఎం కె.విజయ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.